క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఎక్సైజ్‌కార్యాలయంలో గుడుంబా, ఇతర కేసుల్లో పెట్టుబడిన వాహనాలను నేడు(బుధవారం) వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలను వేలం వేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వ్యక్తులు 50 శాతం డిపాజిట్ కట్టాలని కోరారు.

నియామకం

వాజేడు: ఓడ బలిజ సేవా సంఘం మండల అధ్యక్షుడిగా గార నాగార్జున రావు, ఉపాధ్యక్షుడిగా సుగంధం సాంబశివరావులను నియమించారు. ఈ మేరకు ఓడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్ మంగళవారం ప్రకటించారు.

చేయూత



ములుగు రూరల్: మండలంలోని మాన్‌సింగ్ తండా గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి నూనావత్ అనూషకు శంశాబాద్ ఎయిర్‌పోర్టు మేనేజర్ బానోత్ రవీందర్ చేయూతనందించారు. మంగళవారం అనూషకు తోటి ఉద్యోగలతో విరాళాలు సేకరంచి రూ.52 వేలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 సంవత్సరాల క్రితం తల్లితండ్రులను కోల్పోయిన అనూష బంధువుల ఇంట్లో ఉండి చదువుకుంటూ పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ద్వితీయ సంవత్సరం చదువుకు డబ్బులేక మానేసి ఇంట్లో ఉంటున్న విషయం అదే గ్రామానికి చెందిన బానోత్ రవీందర్ తెలుసుకోని తోటి ఉద్యోగుల వద్ద విరాళాలు సేకరించి విద్యార్థినీకి అందించి ఆదర్శంగా నిలిచారు. దీంతో పాటు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు రూ.5 వేలు విరాళం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఏటూరునాగారం: మండలంలోని కమలాపురానికి చెందిన తురక లక్ష్మణ్(19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై తాజొద్దీన్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తురక లక్ష్మణ్, బత్తుల ఉప్పలయ్య పనుల నిమిత్తం భూపాలపల్లికి వెళ్లి కమలాపురానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద బైక్ అజాగ్రత్తగా నపడంతో అదుపు తప్పి కిందపడి తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడు. బాధితుడి తల్లి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకటనలకే పరిమితం

చిట్యాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు కాకుండా ప్రకటనలకే పరిమితం అయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆత్కూరి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మొగుళ్లపల్లి, చిట్యాల, రేగొండ, టేకుమట్ల మండలాలకు చెందిన నాయకులకు మండల కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత విద్య, ఆరోగ్యం సక్రమంగా నిరుపేదలకు అందడం లేదన్నారు. ప్రైవేటు పేరుతో పాఠశాలలో, ఆస్పత్రులలో పేదలను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చింతల రజనీకాంత్, జిల్లా నాయకులు గుర్రం దేవేందర్, భూక్యా నవీన్, కల్పన, కుమార్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

● మంత్రి ధనసరి సీతక్క



ములుగు: జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర

ములుగు: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందనిపంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సీతక్క సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను మంగళవారం కలెక్టర్ టీఎస్. దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, ఎస్పీ శబరీశ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. యువకులు, చిన్నారులు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ములుగు రూరల్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం ములుగు–దేవగిరిపట్నం మీదుగా పత్తిపల్లికి వెళ్లే రోడ్డు పనులను మంత్రి కలెక్టర్ దివాకరతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులకు రూ.6.56కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు 5.5 కిలోమీటర్ల మేరకు పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఏఈ ప్రణీత అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం నిర్మూలన

ఎస్‌ఎస్‌తాడ్వాయి: విద్యతోనే సమాజం పేదరికాన్ని నిర్మూలించవచ్చని ఆదివాసీ గూడెంలోని పిల్లల జీవితాల్లో అక్షర వెలుగు నింపేందుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని నార్లాపూర్‌లో సమీపంలోని తక్కళ్లపాడు గొత్తికోయ గూడెంకు చెందిన పునేం తులసీ గత నేల 2న డ్రామా జూనియర్స్‌లో పాల్గొనగా మంత్రి సీతక్క అభినందిచారు. గూడెంలో దాతల సాయంతో మంత్రి సీతక్క నిర్మించిన పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తక్కళ్లపాడు గూడెంలోని పిల్లలు చదువుకునేందుకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతూ అరకొర విద్యను అభ్యసిస్తున్నారని వారి ఇబ్బందులను తెలుసుకుని గూడెంలో పిల్లలు చదువుకునేందుకు పాఠశాల నిర్మిస్తానన్న హామీ మేరకు పాఠశాలను నిర్మించానన్నారు. పాఠశాల భవనాన్ని 15 రోజుల్లో పూర్తి చేసిన జిల్లా పోలీసు అధికారులకు, భవన నిర్మాణానికి సహాయం అందించిన డాక్టర్ తరుణ్‌రెడ్డిలకు సీతక్క ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శబరీశ్, డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, హనుకొండ చక్రవర్తి ఆస్పత్రి యజమాని తరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని ఎదిర వైద్యాకారి భవ్యశ్రీ అన్నారు. రానున్న మూడు నెలలు వర్షాకాలం సీజన్‌లో సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాలని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 18 పంచాయతీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 26 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలకు ములుగు ఏరియ వైద్యశాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న కుమార్

ములుగు రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మమాంక్‌యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టగా మాజీ ఏబీవీపీ నాయకుడు గండ్రకోట కుమార్ హాజరై సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ 1949 జూలై 09న ఆవిర్భావించి విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తుందని అన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం, కుమార్ ఉన్నారు.

వరదలో చిక్కుకున్న యువకులు

● అధికారుల చొరవతో సురక్షితంగా ఇంటికి..



యువకులను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అధికారులు

మంగపేట : వాగు వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో ఆందోళనకు గురైన యువకులు డయల్ –100కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారులు వరదలో చిక్కుకున్న యువకులను సుక్షితంగా ఇంటికి చేర్చిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధిత యువకులు, అధికారులు తెలిపిన వివరాలు.. మంగపేట మండలంలోని కమలాపురం ఆర్బీహెచ్ కాలనీకి చెందిన సుక్క రీసన్, ఇందిరానగర్‌కు చెందిన దూడపాక దినేష్ గ్రామ సమీపంలోని ఎర్రవాగు దాటి రేగుల గూడెంలోని అటవీ ప్రాంతంలో ఉన్న పొలం వద్దకు సోమవారం మధ్యాహ్నం వెళ్లారు. అయితే వారు ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ఎగువప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తోందిం. దీంతో వారు వాగును దాటలేక, మరోపక్క చీకటి పడుతుండటంతో వారి వద్ద ఉన్న మొబైల్ నుంచి డయల్–100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వగా, అధికార యంత్రాగం వెంటనే అప్రమత్తమైంది. ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, మంగపేట పోలీసులు, రెవెన్యూ అధికారులు, కమలాపురం పంచాయతీ సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌పై యువకులు ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే వాగు ఉధృతి తగ్గుముఖం పట్టడంతో అధికారులు యువకులను సురక్షితంగా ఇంటికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సురక్షితంగా ఇంటికి వచ్చిన వారిని చూసి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేసి అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి



ఏటూరునాగారం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి



మంగపేటలో..

ఏటూరునాగారం: ఏజెన్సీలోని వరద ముంపు గ్రామాల్లో నివాసం ఉంటున్న వృద్ధులు, గర్భిణులను సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరదల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వరద ముంపు ప్రాంతాలపై అన్నిశాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరద ముంపు గ్రామాల్లో వివరాలను సేకరించాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగుల పేర్లు, అడ్రస్‌లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఐటీడీఏలో వరద సాయం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్, పీఆర్ ఏఈ భిక్షపతి, ఇరిగేషన్ ఏఈ రమేశ్, పంచాయతీ అధికారి కుమార్, వైద్యాధికారులు అభినవ్, సుమలత, సీడీపీఓ హేమలత, సూపర్‌వైజర్లు, ఏఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

మంగపేట: వరదల సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ప్రాణనష్టం జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతయుతంగా పని చేయాలని ఎపీడీఓ కృష్ణప్రసాద్, తహసీల్దార్ వీరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి ఇరిగేషన్ అధికారులు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలతో వరదలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరదలపై ముందస్తు జాగ్రత చర్యల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు ఇతర అనారోగ్య కారణాలతో నడవలేని స్థితిలో ఉన్న ప్రతి ఒక్కరి సమాచారం సేకరించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ వలీమ్ మహ్మద్, వైద్యాధికారి యమున, నిఖిల్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు

అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి

ములుగు రూరల్: అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను అంగన్‌వాడీలతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన 1334 మెమోను ఉపసంరించాలని అన్నారు. నూతన జీఓ వచ్చేంత వరకు 65 సంవత్సరాలు నిండిన వారిని విధుల్లో తీసుకోవాలని అన్నారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి సీతక్క అంగన్‌వాడీలకు అందించే రూ.రెండు లక్షల బెనిఫిట్ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఫైల్ అప్రూవల్ అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సరోజన, సమ్మక్క, ప్రేమకుమారి, వెంకటరమణ, రత్న కుమారి, విజయలక్ష్మీ, సుశాంతల, రమాదేవి, రాజమ్మ , లక్ష్మీ పాల్గొన్నారు.

జాతి ఐక్యతను చాటుదాం..



పూజలు చేస్తున్న భక్తులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: సీత్లా పండును ఒకే రోజు జరుపుకొని జాతీ ఐక్యతను చాటుదామని జిల్లా బీఆర్ఎస్ నాయకుడు భూక్య జంపన్న అన్నారు. మంగళవారం మేడారంలో సీత్లా పండగకు ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం పెద్ద పూశాల కార్తీక మాసం మొదటి లేదా రెండో మంగళవారం గిరిజన జాతి శోభ ఉట్టిపడేలా సీత్లా పండుగను జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి జరుపుకోవాలని గత ఐదు సంవత్సరాలుగా వివిధ గిరిజన సంఘాలు మత పెద్దలు, విద్యావంతులు వివిధ ప్రచారకర్తలు ప్రచారం నిర్వహిస్తుంటే ఈ సంవత్సరంలో తొంభై శాతం గిరిజన బంజారాలు ఒకేరోజు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. సీత్లా, తీజ్ పండుగలను సెలవు దినాలుగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాహుల్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా కమిటీ సభ్యులు పవన్ కిషోర్ పొడియా చంటి అలియాస్ రాజేందర్, రాజశేఖర్, కుమార్, విష్ణు, బుక్కరామన్ ,కన్న నాయక్ , వేద్య నాయక్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ ఎనగంటి రామయ్య తల్లి ముత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క మంగళవారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతులు కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజు, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, మండల ఉపాధ్యక్షుడు ఇప్ప నాగేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకులు తాండాల శ్రీను, మొక్క శ్రీను బొప్ప వినోద్, లక్ష్మయ్య, ఎనగంటి నరేష్, తొల్లెం కృష్ణ, కరెంగుల రాంబాబు, జీడి రాజు, సంజయ్, మడకం శోభన్, కాల్వల సమ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన



సుందరయ్యకాలనీ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై హరీశ్

వాజేడు: ముంపు ప్రాంతాల వారు రానున్న వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రుద్రారపు హరీశ్ అన్నారు. మండల పరిధిలోని దూలాపురం, సుందరయ్య కాలనీ గ్రామాల్లో ప్రజలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల వారి వివరాలను అందజేయాలని సూచించారు. వరద పరిస్థితి ఎక్కువగా ఉంటే ప్రతి ఒక్కరూ ఒకరికి ఒకరు సహకరించుకోవాలని చెప్పారు. వరద తీవ్రతను బట్టి పోలీసులకు, ఇతర శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గతంలో గోదావరి వరద ఎక్కడి వరకు వచ్చింది అడిగి తెలుసుకున్నారు.

మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



ములుగు రూరల్: జన్మదిన వేడుకల్లో మంత్రి సీతక్క, పక్కన ఎంపీ బలరాం నాయక్



ములుగు: పండ్లు పంపిణీ చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ములుగు మండలంలోని ఇంచర్ల ఎంఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సైకిళ్లను ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ దివాకర తో కలిసి సీతక్క బహూకరించారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆధ్వర్యంలో సంఘం గౌరవ అధ్యక్షుడు అల్లెం అప్పయ్య కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా విభాగం నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎస్ఎస్‌తాడ్వాయి మండలంలోని కామారంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ రేగ కల్యాణి నోట్ బుక్స్, పెన్నులు, బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. అలాగే మండల కేంద్రంలోని సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది కలిసి ఐకేపీ కార్యాలయంలో మొక్కలను నాటారు. వెంకటాపురం(ఎం) మండలంలోని రామాంజాపూర్ గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు మారం సుమన్‌రెడ్డి తన రక్తంతో గీసిన చిత్రపటాన్ని సీతక్కకు అందజేశారు. గోవిందరావుపేటలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలోని ఇందిర గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలుకు తినిపించారు. మంగపేటలోని కస్తూర్బాయి వృద్ధా శ్రమంలోని వృద్ధులకు శ్రీ చైతన్య ఆటోయూనియన్ మండల అధ్యక్షుడు మహిమూద్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బేవర సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు.

ఎస్సైలకు సన్మానం



ఎస్సై కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

వాజేడు: వాజేడు, పేరూరు ఎస్సైలు రుద్రారపు హరీశ్, గుర్రం కృష్ణ ప్రసాద్‌లను మంగళవారం ఓడ బలిజ సేవా సంఘం నాయకులు సన్మానించారు. ఓడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్, వాజేడు మండల అధ్యక్షుడు గార నాగార్జున రావులతో కలిసి ఓడ బలిజ సంఘం నాయకులు, కులస్తులు ఎస్సైలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు శాలువ కప్పి సన్మానం చేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



ములుగు రూరల్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



వెంకటాపురం(కె)లో..



గోవిందరావుపేటలో..

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ అధికారి యుగేందర్‌కు కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బండి బాబు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రుణాలు రూ.2లక్షల వెంటనే మాఫీ చేయాలని అన్నారు. రైతులకు పెంచిన రైతు భరోసాను వానాకాలం, యసంగికి కలిపి రూ.15 వేలు అందించాలని అన్నారు. కౌలు రైతులకు అందిస్తామని హామీ ఇచ్చిన రూ.12 వేలు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలాలలో నేటి నుంచి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యగ్రహ దీక్షలు చేపడుతామని అన్నారు. హామీలు అమలు పరుచని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవింద్రాచారి, చల్లూరి మహేందర్, రవిరెడ్డి, గాదం కుమార్, మహేందర్, పాపిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచిన హామిలను అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట సతీష్ అన్నారు. మంగళవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడే అట్లూరి రఘురామ్, సాధన పల్లి విజయ్, సంకా హేమ సుందర్, రాజు, చక్రపాణి ఉన్నారు.

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలంలో తహసీల్దార్ సృజన్ కుమార్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వీరబోయిన భిక్షం మంగళవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడాన్ని బీజేపీ కిసాన్ మోర్చా తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రారం సురేశ్, మూల కుమార్, మండల కార్యదర్శి కందాల రవీందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కుమ్మరి కుంట్ల సదానందం, బొల్లపెల్లి మురళి, కుసుమ కిషోర్, అంకిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, బెల్లి లింగయ్య, మూల రంగారెడ్డి, కుక్కని మధుకర్ రెడ్డి, కన్నెగంటి శ్రీకాంత్, వాసం స్వామి, మారబోయిన శ్రీరాములు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలని ఫిర్యాదు

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ గ్రామంలోని అరుణోదయ వీఓకు చెందిన అల్లంల అరుణ ఫోర్జరీ సంతకాలతో స్త్రీ నిధి డబ్బులు కాజేసినట్లు మహిళా సంఘాల సభ్యులు మంగళవారం చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఏపీఎంకు ఫిర్యాదు చేశారు. రొయ్యూర్ గ్రామంలో 13 గ్రామ మహిళా సంఘాలలో 30 మంది సభ్యుల స్త్రీ నిధి డబ్బులు వారికి తెలియకుండానే డ్రా చేసినట్లు బాధిత సంఘ సభ్యులు అల్లంల లక్ష్మి, పద్మావతి, వసంత, భూలక్ష్మి, జయమ్మ, లక్ష్మి ఫిర్యాదులో తెలిపారు. 2022 డిసెంబర్ 1న స్త్రీ నిధి డబ్బులు తీసుకోగా ఈనెల వరకు తెలియకుండా మేనేజ్ చేశారని మండిపడ్డారు. సభ్యుల సంతకాలను ఫోర్జరీ పెట్టి వారి పేర్లతో అరుణ వీఓఏ(సీఏ) కాజేశారని మండిపడ్డారు. సీఏ అల్లంల అరుణపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సారక్క, లక్ష్మి, జయమ్మ, మల్లక్క, పుష్ప, గంగా, రజిత పాల్గొన్నారు.